

# పుస్తక పరిచయం




**తెలుగులో** , మిగతా ప్రక్రియలతో పోలిస్తే , యాత్రాసాహిత్యం తక్కువే అని చెప్పాలి. అందుకు కారణాలు ప్రత్యేకంగా వెదకాల్సిన అవసరం లేదు. యాత్రలు చేయడం అందరికీ సాధ్యపడకపోవచ్చు, అలానే యాత్రలు చేసిన వాళ్ళందరూ తమ అనుభవాలను అక్షరబద్ధం చేయగలిగే వాళ్ళు కాకపోవచ్చు. ఐతే విశేషం ఏమిటంటే తెలుగులో యాత్రాసాహిత్యం వయసు రెండు శతాబ్దాలు! 1830ల్లోనే ఏనుగుల వీరాస్వామయ్యగారు కాశీయాత్రాచరిత్రతో తెలుగులో యాత్రాసాహిత్యానికి శ్రీకారం చుట్టారు. తరువాత చెదురుమదురుగా ఈ ప్రక్రియలో పుస్తకాలు వచ్చినా వాటికి గుర్తింపు అనేది గత పాతికేళ్ళుగా అధికమైందని చెప్పుకోవచ్చు. ప్రపంచం చిన్నదైపోతుండడం ఒక కారణమైతే, అంతర్జాల సాహిత్యం ఎక్కువవడం మరో కారణం అనుకోవచ్చు. నిరంతర పథికుడు, ప్రకృతి ప్రేమికుడు, తోటి మనుషుల మంచితనం మీద అచంచలమైన విశ్వాసం ఉన్న రచయిత దాసరి అమరేంద్రగారు. ఆయన దాదాపు పాతికేళ్ళ క్రిందట స్కూటర్ మీద ప్రయాణం సాగించిన రోహతంగ్ యాత్ర గురించిన పుస్తకం ఇది. 1993లో మిత్రులతో కలిసి అమరేంద్రగారు ఆ సాహసయాత్ర ముగించాక ఆ విశేషాలన్నీ 1996లో ఆంధ్రప్రభలో సీరియల్‌గా రావడమూ, ఆ మరుసటి సంవత్సరమే పుస్తకరూపంలో రావడమూ జరిగింది. అదే పుస్తకాన్ని 20 సంవత్సరాల తర్వాత మలి ప్రచురణగా తీసుకొచ్చారు. మొదలుపెట్టిన వద్దనుంచి ఆపకుండా చదివించే యాత్రా స్మృతి ఈ పుస్తకం. అమరేంద్రగారు స్వతహాగా కథా రచయిత కాబట్టి ఈ యాత్రావిశేషాలన్నీ చక్కటి కథా రూపంలో సాగాయి. కేవలం భౌగోళిక, చారిత్రక విషయాలు కాకుండా తమకెదురైన అనుభవాలు, పరిచయమైన వ్యక్తులూ, సంఘటనలూ, ప్రదేశాలూ.. అన్నీ కలిసి పాఠకులని ఆ యాత్రికులతో కలిసి ప్రయాణం చేసిన అనుభూతిని కలిగిస్తాయి. అధునాతన సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకుని సందర్భానుసారం జతచేసిన గూగుల్ మాప్స్ వల్ల వాళ్ళు ప్రయాణించిన త్రోవని మనం ఊహించుకోవడం సులభతరమౌతుంది. పఠాన్ కోటనుంచి బయలుదేరి కులూ, మనాలీల మీదుగా రోహతంగ్ వరకూ సాగిన నాలుగైదురోజుల సాహసయాత్ర అడుగడుగునా ఆసక్తికరంగా సాగింది. యాభై, అరవై కిలోమీటర్లు అంటే కారు ప్రయాణాలు అలవాటైన ఈ రోజుల్లో పెద్దగా అనిపించకపోవచ్చు కానీ పాతికేళ్ళ క్రిందట ఆయా దూరాలను స్కూటర్లమీద చుట్టిరావడమనేది సాహసయాత్రే. అమరేంద్రగారు ముందు మాటలో చెప్పారు "ఈ రచన పాఠకులకు మానసోల్లాసం కలిగించితే, యాత్రలగురించి ఇంకా ఇంకా చదవాలని అనిపించేలా చేస్తే - ఊళ్ళు, ప్రదేశాలూ తిరగాలన్న ఉత్సాహం కలిగిస్తే - నా ప్రయత్నం ఫలించినట్లే" అని. ఈ పుస్తకాన్ని ఆస్వాదించిన పాఠకులు అమరేంద్రగారి భావాలతో పూర్తిగా ఏకీభవిస్తారు!

***Dasari Amarendra***
A-301, Shivam Apartments, Flat# 14
Sector 12, Dwaraka,
New Delhi – 110078
Cell#: 9818982614
damarendra53@gmail.com




**అలనాటి** చలనచిత్ర ప్రముఖుడు, నటుడు, నిర్మాత, దర్శకుడు, సినీవ్యాపారవేత్త ఎల్వీ ప్రసాద్‌గారు. భారతదేశంలో వచ్చిన మొట్టమొదటి టాకీ చిత్రాలు , మూడు భాషల్లోనూ ( హిందీ, తమిళ, తెలుగు) నటించిన అరుదైన రికార్డు సొంతం చేసుకున్న వ్యక్తి. సంసారం, మిస్సమ్మ, అప్పుచేసిపప్పుకూడు లాంటి ఎవర్ గ్రీన్ సినిమాలకి దర్శకత్వం వహించారు ఎల్వీప్రసాద్ గారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌముడ్ని వెండితెరకు పరిచయం చేసింది కూడా ఎల్వీప్రసాద్ గారే. సినీరంగంలో ఎదిగి, సినిమా రంగంలో వ్యాపారాలను విస్తరించిన ద్రష్ట ఎల్వీప్రసాద్‌గారు. ఆయన ఎంత ఎత్తుకి ఎదిగినా నడిచొచ్చిన దారులను మరచిపోలేదు. జేబులో వందరూపాయలతో బొంబాయి వెళ్ళి పదిహేను సంవత్సరాలపాటు ఢక్కామొక్కీలు తిన్న జ్ఞాపకాలను ఆయన ఎప్పుడూ పంచుకుంటూ ఉండేవారు. మిగతా సినీప్రముఖుల గురించి వచ్చినన్ని వ్యాసాలు, విశ్లేషణలూ ఎల్వీప్రసాద్ గారి గురించి రాలేదు అనేది వాస్తవం. ఇన్నాళ్ళకు ఎల్వీప్రసాద్‌గారి గురించి ఒక సమగ్రమైన పుస్తకం రావడం ఎంతైనా సంతోషించదగ్గ విశేషం. ప్రముఖ రచయిత ఓలేటి శ్రీనివాసభానుగారు 2010లో నవ్యవీక్లీలో సీరియల్‌గా వ్రాసిన వ్యాస సంకలనాన్ని రెండేళ్ళ క్రిందట అందమైన పుస్తకరూపంలో తీసుకొచ్చారు. ఈ పుస్తకాన్ని అందరూ తేలిగ్గా చదువుకోగలిగిన సరళమైన భాషలో, ఆసక్తికరమైన శైలిలో వ్రాసిన శ్రీనివాసభానుగారు ఎంతైనా అభినందనీయులు. స్వతహాగా కథా రచయిత కాబట్టి శ్రీనివాసభానుగారు వ్రాసిన ఎల్వీప్రసాద్‌గారి జీవితవిశేషాలు ఒక చక్కటి కథా రూపంలో సాగాయి. సందర్భానుసారం చేర్చిన అరుదైన చిత్రాలు ఈ పుస్తకానికి పరిపూర్ణతని సంతరించి పెట్టాయి. అలాగే ఎల్వీప్రసాద్ గారు దర్శకత్వం వహించిన కొన్ని చిత్రాల గురించిన అరుదైన సమాచారాన్ని,, సమీక్షలను దశాబ్దాల క్రిందటి పత్రికలనుంచి సేకరించి ఇందులో చేర్చారు. ఎల్వీప్రసాద్‌గారి గురించి ఇతర సినీప్రముఖులు వ్రాసిన వ్యాసాలు, సినీ పరిశ్రమ గురించి ఎల్వీప్రసాద్ గారు వ్రాసిన వ్యాసాలు ఈ పుస్తకానికి అదనపు ఆకర్షణలు. ఈ బృహత్తర ప్రణాళికకు శాశ్వతంగా నిలిచే పుస్తక రూపమిచ్చిన రచయిత శ్రీనివాసభానుగారు, ప్రచురణకర్తలు క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్ వారు అభినందనీయులు..!

***

***Oleti Srinivasa Bhanu***

\# 337 B, Phase – II , Janapriya Archadia
Koukur, Near Bollaram Check Post
SECUNDERABAD – 10
Phone: 9440567151
voletibhanu@gmail.com

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**